సాక్షి
చిత్తూరు
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



బ్రహ్మోత్సవాలను దిగ్విజయం చేయాలి
కాణిపాకం బ్రహ్మోత్సవాలను సమష్టిగా విజయవంతం చేయాలని దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ సూచించారు. - 8లో



టమాటా ధరలు డమాల్
టమాటా ధరలు భారీగా పతనమయ్యాయి. నగటు ధర 15కిలోల బాక్సు రూ.50, అత్యధిక ధర రూ.270 పలుకుతోంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	24
తిరుపతి	31	25
తిరుమల	26	20
గూడూరు	31	26
నగరి	32	25

న్యూస్‌రీల్

భక్తజనసంద్రంగా బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: బోయకొండ శ్రీగంగమ్మతల్లి దీవెనల కోసం ఆదివారం భక్తులు అశేషంగా తరలివచ్చారు. బోయకొండ పరిసరాల్లో ఎటుచూసినా భక్తజన సందడి కనిపించింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలి రావడంతో క్యూలు కిక్కిరిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవ్వెలతో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు త్వరితగతిన దర్శనం చేసుకునేలా ఆలయ ఈఓ చంద్రమౌళి చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు.

6న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయ గోశాలలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు గో పూజ ఉంటుందన్నారు. భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

8న సామూహిక వరలక్ష్మీ వ్రతం
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఈనెల 8వ తేదీ శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఆలయ ఆస్థాన మండపంలో వ్రత పూజలు జరుగుతాయన్నారు. ఈ వ్రతంలో పాల్గొనే మహిళలు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని వివరించారు. భక్తులు కలశానికి రాగి, ఇత్తడి చెంబును తీసుకురావాలని, మిగిలిన పూజా సామాగ్రిని దేవస్థానం సమకూరుస్తుందని పేర్కొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు జరుగుతాయని చెప్పారు. ఒకటి, ఏడు, రెండు, నాలుగు స్థాయి సంఘాల సమావేశాలు ఉదయం 10 గంటలకు, మూడు, ఐదు, ఆరు స్థాయి సంఘాల సమావేశాలు మధ్యాహ్నం 2 నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయని తెలిపారు. సభ్యులు తప్పక హాజరుకావాలన్నారు.

9లోపు కళాకారులు దరఖాస్తులు చేసుకోవాలి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే కళాకారులు ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18న చవితి రోజు నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనే కళాకారులు, ఆస్థాన మండపంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే కళాకారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా తయారీ




మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తప్పులేని ఓటరు జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితా పున:పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నట్లు చెప్పారు. ఓటర్ల తొలగింపులో నిబంధనలు సక్రమంగా పాటించారా? లేదా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ఇంటి యజమానులు, బంధువులను పిలిపించి మాట్లాడి విచారించాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాలను పున:పరిశీలిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో తొలగింపులకు సంబంధించి 53,537 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిని తిరిగి పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోపు ఎలాంటి పొరబాట్లు లేకుండా పూర్తి చేసేలా బీఎల్‌వోలను ఆదేశించినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

మింగేస్తున్నారు!

అజాగ్రత.. మితిమీరిన దురలవాట్లు.. డబ్బుంటే ఏ వ్యాధి అయినా నయం అవుతుందనే ధీమా.. వెరసి మనిషి జీవితాన్ని నాశనం చేస్తోంది. ఫలితంగా నిద్ర లేవగానే ముద్ద కంటే ముందు మందు బిళ్లలు తినాల్సి వస్తోంది. ఫలితంగా ఫార్మసీ వ్యాపారం జోరందుకుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రోజూ రూ.16 కోట్ల పైనే వ్యాపారం సాగుతోంది. మితిమీరిన మాత్రల వాడకం వల్ల కొత్త జబ్బులు కొనితెచ్చుకోవాల్సి వస్తుందని వైద్య యంత్రాంగం హెచ్చరిస్తోంది. ఆరోగ్య నియమాలు పాటిస్తే జబ్బులన్నీ అదుపులోకి వస్తాయని సూచిస్తోంది.



భోజనానికి ముందు మింగే కొన్ని మాత్రల వివరాలు

మాత్రల రకం	సంఖ్య(రోజువారీ)
పాంటో ప్రజోల్	1,50,000
ఒమెప్రజోల్	1,75,000
లానోస్ప్రజోల్	1,50,000
రానిటిడిన్	1,60,000
ఎసోమెప్రజోల్	1,30,000
లాన్స్‌ప్రజోల్	1,50,000
రాబెప్రజోల్	1,70,000

- భోజనానికి ముందు మాత్రలు మింగుతున్న జనం
- బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులే అధికం
- పెరిగిన వినియోగం
- జోరుగా సాగుతున్న ఫార్మసీ వ్యాపారం
- రూ.కోట్లల్లో ఆదాయం

తినక ముందు వాడాల్సిన మందులు

- బీపీ
- షుగర్
- థైరాయిడ్
- పేగు సమస్యలు
- శ్వాస సంబంధిత వ్యాధులు
- అల్సర్
- రక్త సంబంధిత వ్యాధులు
- గుండె సంబంధిత వ్యాధులు
- నోటి సమస్యలు
- జీర్ణాశయ వ్యాధులు



సాక్షి తిరుపతి: జీవనశైలిలో మార్పులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం, చెడు అలవాట్లుకు బానిసకావడంతో వ్యాధులు కబళిస్తున్నాయి. ఆరోగ్య సూత్రాలపై అవగాహన లేని కారణంగా విచ్చలవిడిగా మాత్రలు మింగేస్తున్నారు. జనం తిండికంటే ముందు పరకడుపున మాత్రలను తీసుకోవాల్సి వస్తోంది. ఈ రకమైన మాత్రలు వాడే వారి సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతోంది. ఫలితంగా ఫార్మసీ వ్యాపారం జిల్లాలో మూడు మందు బిల్లులు..ఆరు ఇంజెక్షన్లుగా విరాజిల్లుతోంది. దీంతో మందుల వ్యాపారం రూ. కోట్లల్లో సాగుతున్నట్లు డ్రగ్స్, వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచింగ్ ఆస్పత్రులు 2, జిల్లా ఆస్పత్రి 1, ఏరియా ఆస్పత్రులు 7, సీహెచ్‌సీలు 15, పీహెచ్‌సీలు 108, ప్రైవేటు ఆస్పత్రులు 4 వేలకు పైగా ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం 25 వేలకుపైగా ఓపీలు వస్తుంటాయి. ఇందులో అధికంగా బీపీ, మధుమేహం, గుండె, కడుపులోమంట, శ్వాస సంబంధిత సమస్యలకు సంబంధించిన వారే అధికంగా వస్తుంటారు. ఎన్‌సీడీ సర్వే ఆధారంగా 2,03,175 బీపీ కేసులు, 2,45,812 మధుమేహ కేసులు, 2401 మందికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే కిడ్నీ బాధితులు 4,365 మంది, శ్వాస సంబంధిత సమస్యలు 12,365 మందికి ఉన్నట్లు ఓపీల ఆధారంగా అధికారులు గుర్తించారు. ఇలాంటి వ్యాధుల నివారణకు తినకముందే మాత్రలు వాడకం పరిపాటిగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ రకమైన మాత్రలు వాడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ విస్తరిస్తోంది. అన్నం తినకముందే తినే మాత్రల అమ్మకాలు నిత్యం దాదాపు రూ. 2 కోట్లు ఉండవచ్చని ఫార్మసీ సంఘం నాయకులు చెబుతున్నారు.

పొద్దునే మింగాల్సిందే...
జబ్బులు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధింత వ్యాధులు అధికంగా పట్టి పీడిస్తున్నాయి.ఈ వ్యాధులున్న వారి సంఖ్య పెరగడంతో మందులు, మాత్రల వినియోగం ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులకు సుమారు రూ. 8 కోట్లు విలువ చేసే మాత్రలు, మందులను అందజేస్తోంది. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతిరోజు రూ.8 కోట్ల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు ఫార్మసీ నిర్వాహకులు చెబుతున్నారు. ఇందులో భోజనం తినకముందే తినే మాత్రలు అధికంగా అమ్ముడుపోతున్నాయి. ఉదయం నిద్ర లేవగానే టీ, కాఫీ, అల్పాహారానికి బదులు కొన్ని రకాల మాత్రలను వినియోగిస్తున్నట్లు గుర్తించి, ఆ రకమైన మాత్రలను భారీగా అమ్మకానికి తెచ్చిపెడుతున్నారు. ముద్ద మింగక ముందే మింగే మందు బిళ్లల వ్యాపారం ప్రైవేటు షాపులో సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇకపోతే యాంటీ బయోటిక్ మాత్రలను పరకడుపున అధిక మోతాదులో మింగేస్తున్నారు. ఈ యాంటీ బయోటిక్ మాత్రల అమ్మకాలు జోరందుకుంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా చాలా మంది షాపు కెళ్లి మాత్రలు కొని, మింగుతున్నారు. దీంతో మరికొన్ని జబ్బులను కొన్ని తెచ్చుకోవాల్సి వస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



రోగికి మందులు ఇస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

జాగ్రత్తలు పాటించకపోతే....
అందరికీ ఆరోగ్య సూత్రాలు తెలుసు. కానీ పాటించే వారు కనీసం రెండు శాతం మంది కూడా లేరు. చిన్న చిన్న అజాగ్రత్తలతో ఎంతో మంది అనారోగ్యం పాలవుతున్నారు. అజాగ్రత్తకు తోడు వైద్య శాస్త్రం పురోగమించింది. కొత్త కొత్త ఖరీదైన మందులెన్నో వచ్చాయి. ఆధునాతన ఆపరేషన్లు పుట్టుకొచ్చాయి. మంచి సదుపాయాలున్న ఆస్పత్రులు ఉన్నాయి. డబ్బుంటే చాలు, అన్నీ తగ్గించుకోవచ్చనే ధీమా పెరిగిపోతోంది. ఆరోగ్య సూత్రాలు పాటించకపోవడంతో నిద్రలేమి సమస్య, దురలవాట్లతో గుండెపోటు, పక్షవాతం వస్తాయి. మాదక ద్రవ్యాల వ్యసనంతో కొలస్ట్రాల్ సమస్య, జంక్‌ఫుడ్‌తో రక్తంలో కొలెస్ట్రాల్ పెరుగుతోంది.



మాత్రలతో ముప్పు..
ముక్క లేకుండా ముద్ద దిగడం లేదనే రోజులు పోయాయి. ఇప్పుడు మాత్రలు లేకుండా ముద్ద దిగడం లేదనే రోజులొచ్చాయి. ఇందుకు కొన్ని జబ్బులే ప్రధానం. ఆరోగ్య నియమాలు పాటించకపోవడంతోనే జబ్బులను కొన్ని తెచ్చుకోవాల్సిన దుస్థితి వస్తోంది. కచ్చితంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. బయటి ఫుడ్‌కు అలవాటు పడకూడదు. డాక్టర్ సలహాలు, సూచనలు లేకుండా మాత్రలు మింగకూడదు. నొప్పులు వెంటనే తగ్గాలని పెయిన్ కిల్లర్స్‌కు అలవాటు పడితే..అది మిమ్మల్ని చంపేస్తాయి. తర్వాత కిడ్నీ, గ్యాస్ట్రిక్ సమస్యలను తెచ్చుకోవడం ఖాయం. జాగ్రత్తలు పాటించి మాత్రల ముప్పు నుంచి బయట పడాలి.
– డాక్టర్ రవిరాజు, వైద్య నిపుణులు

శాస్త్రోక్తం.. సంకటహర చతుర్థి వ్రతం



వ్రత పూజల్లో అశేషంగా పాల్గొన్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు వచ్చే చతుర్థి రోజున ఆలయంలో వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపుగా ఆస్థాన మండపానికి తీసుకు వచ్చి పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి సూపరింటెండెంట్ రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు స్పందన
చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సమస్యల వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడ వచ్చని పేర్కొన్నారు.

19 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలో ఈనెల 19వ తేదీ నుంచి జరగనున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో ఆయన సమీక్షించారు. తిరుమల తరహాలో స్వామివారికి ఎక్కడా లోటు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవ కళ ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

తప్పెవరిది అమ్మా?

ఆడబిడ్డను కని డ్రైన్‌లో పడేసిన తల్లి

- ఏమీ ఎరుగనట్టు ఆస్పత్రిలో అడ్మిట్
- బిడ్డ చనిపోయిందంటూ బుకాయింపు
- తీరా ఆస్పత్రికి సురక్షితంగా చేరిన చిన్నారి
- బిడ్డకు వైద్యం అందించిన ఏరియా ఆస్పత్రి వైద్యులు
- ఇప్పుడు బిడ్డ కావాలంటూ తల్లి కొత్త నాటకం



తల్లి ప్రేమనే ఎంచుకున్నా
నన్ను బాగా చూసుకుంటావని కలలుగన్నా
కానీ.. బొడ్డుతాడు తెగకముందే నన్ను బలిపశువును చేశావు
కన్నప్రేమను మరిచి కసాయిగా ప్రవర్తించావు
నీ పరువు కోసం నన్ను మురుగు కాలువలో విసిరేశావు
నువ్వు చేసిన తప్పునకు నన్ను శిక్షిస్తావా అమ్మా?
అని ఆ తల్లిని నిగ్గదీసి అడుగుతున్నట్టుంది కదూ..! ఈ ఫొటోలోని శిశువు!

పలమనేరు: పలమనేరులో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళ అప్పుడే పుట్టి.. కళ్లు కూడా తెరవని బిడ్డను మురుగు కాలువలో పడేయడం చర్చనీయాంశమైంది. దుర్గంధం భరించలేక.. క్రిమికీటకాలతో పోరాడలేక ఆ బిడ్డ గుక్కపట్టి ఏడ్వడం చూపరులను కలచివేసింది. ఈ హృదయ విదారక సంఘటన ఆదివారం వెలుగుజూసింది.

జరిగింది ఇలా..
కర్ణాటక రాష్ట్రం, ముళబాగిళు ఆవాస గ్రామంలోని అమరావతి(40)కి పెళ్లై ఇరవై ఏళ్లయ్యింది. 17 ఏళ్ల క్రితం భర్త మృతి చెందాడు. కుమార్తెకు పెళ్లి చేసింది. అయితే పట్టణానికి చెందిన 50 ఏళ్ల పెళ్లైన వ్యక్తితో పరిచయం పెంచుకుంది. సహజీవనం చేస్తూ గర్భం దాల్చింది. పట్టణంలో రహస్యంగా కాపురం పెట్టింది. శనివారం వేకువజామున అమరావతి స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలోని కేవీఎస్ స్ట్రీట్‌లో ఆడబిడ్డను కని డ్రైన్‌లో పడేసింది. ఆపై తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రిలో చేరింది. జరిగిన విషయం తెలుసుకున్న వైద్యులు పసికందు ఎక్కడని ప్రశ్నించగా శిశువు మృతి చెందిందని వారిని నమ్మించింది. ఇలా ఉండగా కేవీఎస్ వీధిలో వాకింగ్ వెళ్లేవాళ్లు ఆదివారం ఉదయం డ్రైన్‌లో పసికందు కేకలు విని చలించిపోయారు. ఆ పసి గుడ్డును స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్‌యుగంధర్ పసికందును ఎన్‌బీయూ(న్యూ బోర్న్ బేబీ యూనిట్)లో పెట్టి చికిత్సలందించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో పంపించారు.

శిశు విహార్‌కు తరలింపు
ఈ విషయంపై స్థానిక వైద్యులు పోలీసులు, ఐసీడీఎస్ వారికి సమాచారాన్ని అందించారు. దీంతో అక్కడికెళ్లిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ వర్కర్, ఆశాలు కలిసి పాప ఆరోగ్యం కుదుటపడ్డాక ఐసీపీఎస్ ద్వారా తిరుపతి శిశు విహార్‌కు పంపనున్నట్టు తెలిపారు. మరోవైపు పోలీసులు సైతం బిడ్డ తల్లి, కారణమైన వారిపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

నా బిడ్డ నాకే కావాలి
'నేను ఆస్పత్రికి వస్తుండగా దారిలోనే కాన్పు అయ్యింది. బిడ్డ చనిపోయిందనుకుని డ్రైన్‌లో పడేశాను. బిడ్డ బతికే ఉందంటే నేనే తీసుకెళ్తా..' అంటూ అమరావతి కన్నీళ్లు పెట్టుకుంది. ఇలా ఉండగా ఆమె ప్రియుడు ఆస్పత్రిలో జరిగేదంతా చూస్తూ ఏమీ తెలియని వాడిలా అక్కడి నుంచి పరారైనట్టు తెలిసింది. ఏదేమైనా వారు చేసిన తప్పునకు పసిగుడ్డును బలిచేయడం మానవత్వానికే మచ్చలాంటిందని.. ఆ తల్లికి మనసేలా వచ్చిందంటూ స్థానికులు మాట్లాడుకోవడం కనిపించింది.



కాలువలో పడి ఉన్న అప్పుడే పుట్టిన ఆడ శిశువు



మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలింపు

మీటర్ గిర్రున తిరుగుతోంది

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే 20 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. ఆగస్టు నెలలో వేసవిని తలపించేలా తీవ్రమైన ఉక్కు, ఎండ పరిస్థితులు ఏర్పడడంతో వాడకం అనూహ్యంగా పెరిగిపోయింది. కేటాయించిన దానికంటే అధికంగానే వినియోగం జరుగుతోంది. ఆగస్టు నెలలో నిర్వాహణ నిమిత్తం కొన్ని థర్మల్‌స్టేషన్లలో సరఫరా ఆపివేస్తారు. అదే విధంగా డిస్కంకు మొత్తం 3,900 మెగా వాట్లు రావాల్సి ఉండగా 800 తక్కువ వస్తోంది. అందులో పవన విద్యుత్ 2,500 మెగావాట్లకు బదులు 750 మాత్రమే వస్తోంది. ప్రస్తుతం సెప్టెంబర్ నెలలో కోటా పెరిగింది. వ్యవసాయ, గ్రామీణ సర్వీసులకు అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- భిన్నమైన వాతావరణ పరిస్థితులు
- పెరుగుతున్న కరెంట్ వాడకం
- జిల్లాకు కేటాయించిన విద్యుత్ 19 ఎంయూ
- వినియోగిస్తున్నది 26 ఎంయూ
- సెప్టెంబర్‌లో పెరిగిన కోటా
- అంతరాయాలు ఉండకపోవచ్చు



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో క్రమేణా సర్వీసులతో పాటు వినియోగం పెరుగుతోంది. దీనికి తోడు పరిశ్రమల వాడకం చెప్పాల్సిన పనిలేదు. భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఆగస్టులో అనూహ్యంగా వాడకం పెరిగింది. జిల్లాకు ఆగస్టు నెలలో రోజువారీ కోటా 19–19.98 ఎంయూ ఉండగా, వాడకం 25.09–26.03 మిలియన్ యూనిట్లుగా ఉంది. గృహ అవసరాలు, అన్ని రంగాల్లో కేటాయించిన దాని కంటే దాదాపు 50 లక్షల యూనిట్లు వరకు అదనంగా వాడుతున్నారు. రోజు 33 కేవీ లైన్ ట్రిపింగ్, 13, 11 కేవీ లైన్ ట్రిపింగ్ 200 వరకు అవుతున్నాయి. దీంతో రోజు జిల్లాలో 30–35 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో సల్పంగా కోత విధించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లాలోని 7 మరమ్మతు కేంద్రాల్లో సకాలంలో సిద్ధం చేసి ఇస్తున్నారు. గత నెలలో వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా వాటిని బాగు చేసి ఇచ్చారు. జిల్లాలో 19 గ్రామీణ ప్రాంతాల్లో 5 ఎంవీఏ సామర్థ్యం సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నారు. వీటి పనులు ఈనెలలోపు పూర్తి చేసి 62,320 హెచ్‌పీ సామర్థ్యంతో మెరుగైన సరఫరాను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇవి కాకుండా కొత్తగా నియోజకవర్గానికి 2 చొప్పున ఉమ్మడి జిల్లాకు 33 సబ్‌స్టేషన్లను మంజూరు చేశారు.

థర్మల్‌స్టేషన్ నుంచి విద్యుత్
సెప్టెంబర్ నెలలో విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా జిలా కోటా 23.27 ఎంయూ కాగా, వాడకం 19.98 ఎంయూగా ఉంది. దీంతో పాటు థర్మల్‌స్టేషన్ నుంచి విద్యుత్ అందించనున్నారు. పవన విద్యుత్ కూడ వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లా విద్యుత్ సమాచారం

గృహ సర్వీసులు	13,73,346
వాణిజ్యం	1,61,215
పరిశ్రమలు	21,175
ప్రభుత్వ సర్వీసులు	46,690
వ్యవసాయం	3,17,709
వీధిదీపాలు	17000
ఆర్‌డబ్ల్యూఎస్	13924
హెచ్‌టీ	1906
మొత్తం	19,52,790

అంతరాయాలు తగ్గుతాయి
ఈనెల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయి. ప్రస్తుతం కోటా పెరిగింది. వీటికి తోడు థర్మల్, పవన్ విద్యుత్ కేంద్రాల నుంచి సరఫరా పెరుగుతోంది. గత సంవత్సరం కంటే ప్రస్తుతం 20 శాతం వాడకం పెరిగింది. వ్యవసాయ, గ్రామీణ సర్వీసులకు అంతరాయం లేకుండా సరఫరా చేస్తాం
– కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో

క్లుప్తంగా

96.32 శాతం పింఛన్ల పంపిణీ



రుయాలో గంగవరానికి చెందిన లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీని చురుగ్గా జరుగుతోంది. ఈ నెలకు 2,66,048 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 7,945 మందికి కొత్తగా పింఛన్లను మంజూరు చేసింది. మూడు రోజులుగా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. కొందరు అనారోగ్యంతో ఇతర ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న అక్కడికి వెళ్లి పింఛన్లను అందజేశారు. ఆదివారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 96.32 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగవరం మండలం చిన్నూరు గ్రామానికి చెందిన కె.సరస్వతమ్మకు స్థానిక వలంటీర్ పింఛన్ అందజేశారు.

సస్యరక్షణతో మధురమే..!

మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.65 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో ప్రధాన పంటల్లో మామిడి ఒకటి. వర్షాకాలంలో మామిడి తోటలను రక్షించుకోవల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి తగు సూచనలు ఇస్తున్నారు. వర్షాకాలంలో మామిడిని ఆశించే గూడు పురుగు, కాండం తొలిచే పురుగులతో పాటు గమ్మోసిస్ బంక నుంచి తోటల రక్షణ, అధిక దిగుబడులకు చేపట్టాల్సిన సస్య రక్షణ పద్ధతులను ఇలా వివరించారు.


- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.65 లక్షల ఎకరాల్లో తోటలు
- ఖరీఫ్‌లో కాండం తొలిచే పురుగుతో జాగ్రత్త
- సేంద్రియ ఎరువుల వినియోగం మేలు
- సూచనలు పాటించాలంటున్న ఉద్యానవన అధికారులు



పుత్తూరులో సూచనలు ఇస్తున్న ఉద్యానవన అధికారి సౌజన్య



తెగులు ఆశించిన మామిడి చెట్టు



తెగులుతో దెబ్బతిన్న చెట్టు , గూడు పురుగు

పుత్తూరు రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో మామిడి తోటల్లో రైతులు సస్యరక్షణ చర్యలను పాటిస్తే తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చు. ఆది నుంచే చర్యలు ప్రారంభిస్తే రైతులు మధుర ఫలం అధిక దిగుబడులను గ్యారెంటీగా పొందవచ్చు. చెట్ల చుట్టూ పాదులు చేసి పశువుల ఎరువు, వేపపిండి గానుగ చెక్క వంటి సేంద్రియ ఎరువులను విధిగా వినియోగించాలి. వీటితోపాటు యూరియా, నత్రజని భాస్వరం పొటాషియం వంటి ఎరువులను చెట్టు చుట్టూ వేసి మట్టి కప్పాలి. చెట్టు పైనుంచి ఎండు పుల్లల్ని తొలగిస్తూ, కొమ్మలను రంపంతో కోయడం వల్ల వెలుతురు, గాలి చెట్లకు వస్తుంది. పిట్టలు మామిడి కొమ్మలపై రెట్ట వేయడం ద్వారా అనుకూల పరిస్థితుల్లో మొలకెత్తుతాయి. ఇలా మొలకెత్తిన కొమ్మలోని ఆకులు ఇంచుమించు మామిడి ఆకుల్లా కొంచెం పొడవుగా వుంటాయి. ఇలా పెరిగే కొమ్మ అసలు మామిడి చెట్టు నుంచి పోషకాల్ని గ్రహించడం ద్వారా క్రమేపి చెట్టు చివర్ల నుంచి కిందకు ఎండిపోతూ వస్తుంది. ఈ సమయంలో మొక్కతో సహా ఒక అంగుళం వరకు నరికి నాశనం చేయాలి. నరికిన చోట బోర్డ్ పేస్ట్ పూయాలి. ఇదే సమయంలో పాదుల్లో సేంద్రియ ఎరువులతో పాటు ట్రికోడెర్మావిరిడ్ మందును వేయాలి. తెగులు, పురుగేల మూల జీవులకు ఆశ్రయమిచ్చే మొక్క భాగాలను గుర్తించి తగిన సస్య రక్షణ చేపట్టాలి. తెగులు నివరణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మందుతో పాటు వేపనూనె కలిపి చెట్టు మొదళ్లను తాపడంతో పాటు, ఈ మిశ్రమాన్ని చెట్ల చిగురాకులపై పిచికారీ చేయాలి. భూసారాన్ని, మిత్ర జీవులను పెంచే జనుము, అలసంద, ఉలవ, వినుము, జీలుగ వంటి అంతర్ పంటలను సాగుచేయాలి. ఇలా చేయడం వల్ల తోటలు ఆరోగ్యవంతంగా ఉంటూ అధిక దిగుబడులను ఇస్తాయి.

2.65 లక్షల ఎకరాల్లో తోటలు

చిత్తూరు జిల్లాలో 1.93 లక్షల ఎకరాలతో పాటు తిరుపతి ఉద్యానవన శాఖ పరిధిలో 72 వేల ఎకరాలతో కలిపి మొత్తం 2.65 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఏటా 2 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. పుత్తూరు, చిత్తూరు, తిరుపతి, బంగారుపాళెంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నడుస్తున్నాయి. దామలచెరువులో ప్రైవేట్ యార్డ్ ఉంది. ఈ యార్డుల ద్వారా ఏటా సుమారు రూ.400 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోంది. ఇందులో సుమారు రూ.30 కోట్ల మేర మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు మామిడి ఎగుమతి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో దిగుబడులు అందిస్తున్న మామిడి తోటలను సంరక్షించుకొనే దిశగా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

తెగుళ్ల వ్యాప్తిని అరికట్టాలి



మామిడి సీజన్ పూర్తవగానే చెట్లను ఆశించే పురుగులు, బంక నుంచి రక్షించుకొనే పనులు ప్రారంభించాలి. ప్రస్తుతం మామిడి పంటను ఆశిస్తున్న పురుగుల్లో ప్రధానమైంది గూడు పురుగు. ఈ పురుగు సాధారణంగా 30 నుంచి 40 ఏళ్ల చెట్లను ఆశిస్తాయి. ఇలా గూడు పురుగు సోకిన కొమ్మలను కత్తిరించి, దూరంగా తీసుకెళ్లి కాల్చివేయాలి. తర్వాత గూడు పురుగు నివారణకు క్వినోల్‌ఫాస్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు సెలోఫాస్ అనే మాత్రను పురుగు తొలిచిన కాండం భాగంలో లేదా బెరడు భాగంలో ఉంచి మట్టితో కప్పేయాలి. దీంతో పురుగు లోపలి భాగంలోనే చనిపోతుంది. అలాగే కాండం, కొమ్మలపైన గమ్మోసిస్ బంక కారడాన్ని ప్రధానంగా నివారించాలి. ఇందుకు బెరడును తీసివేసి కాపర్ ఆక్సీక్లోరైడ్ (సీఓసీ) 5 గ్రాముల మందును లీటరు నీటితో కలిపి బ్రష్‌తో తాపడం చేయాలి. తద్వారా మంచి దిగుబడిని పొందవచ్చు. **బి. దశరథరామిరెడ్డి , జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, తిరుపతి**



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,490

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

రైలు నుంచి జారి పడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కుప్పం రూరల్: రైలు నుంచి జారి పడి వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన కుప్పం మండలం , రాగిమానుమిట్ట సమీపంలోని చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. ఆదివారం ఉదయం బెంగళూరు- చెన్నై రైల్వే మార్గంలో రైలు నుంచి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. ఇతనికి సుమారు 45 సంవత్సరాలు ఉంటుంది. చిన్న గళ్ల షర్టు, తెల్ల రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు తెలిపారు.

బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలి



లడ్డూ పోటు భవనాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలను సమష్టిగా దిగ్విజయంగా నిర్వహించాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సూచించారు. ఆదివారం కాణిపాక ఆలయం, పరిసరాలు, ఆరులైన్ల పక్కన ప్రభుత్వం ఆలయానికి ఇచ్చిన 18.6 ఎకరాల భూమిని, నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ పోటు భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయ ఈఓ సమావేశం మందిరంలో చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 18న వినాయక చవితి రోజు నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల్లో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, శానిటేషన్, బ్రహ్మోత్సవ నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాల అంశాలపై చర్చించారు. రథోత్సవం, కల్పవృక్షం, పుష్పపల్లకీ సేవ, తెప్పోత్సవం రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే తిరుపతి జిల్లాలోకి..



సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల, రొంపిచెర్ల ప్రజల అభీష్టం మేరకే ఈ రెండు మండలాలను తిరుపతి జిల్లా, తిరుపతి రెవెన్యూలో చేర్చనున్నారని జిల్లా సహకార ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ గోటూరి మురళీ మోహన్‌రెడ్డి తెలిపారు. కల్లూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కూడా ఈరెండు మండలాలు తిరుపతి రెవెన్యూలోనే ఉండేవని, ఇప్పుడు కూడా అలానే ఉండాలని రెండు మండలాలలోని 50వేల మంది కోరికని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతి జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారే తప్ప ఇందులో ఎలాంటి స్వలాభం లేదని స్పష్టం చేశారు. ఆయన ఒకప్రాంతానికో, జిల్లాకో పరిమితం కాదని రాష్టానికి మంత్రిని తెలిపారు. కొందరు వ్యక్తులు, పత్రికలు తప్పు పట్టడం సబబు కాదన్నారు. నిత్యం ప్రజల మేలు కోరే వ్యక్తి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డని ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, నాదమునిరెడ్డి, పోకల చంద్ర, రాయల్‌మోహన్, మునీశ్వర, మునస్వామి, ప్రతాప్‌రెడ్డి, రమణ, శ్రీనివాసులు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పెళ్లల్లో కూరుకుని వ్యక్తి మృతి

- భయంతో పూడ్చిపెట్టిన తోటి కూలీలు
- ఆలస్యంగా వెలుగులోకి..
- ముగ్గురిపై కేసు నమోదు



రాళ్లు, మట్టిని తొలగించిన పొలం



మృతి చెందిన సంపత్(ఫైల్)

యాదమరి: మండలంలోని పెదకంటిపల్లె వ్యవసాయ భూమిలో రిగ్గుబండితో రాళ్లను పేల్చిన సందర్భంలో వ్యక్తిపై రాళ్లు, మట్టి పెళ్లలు పడడంతో అక్కడిక్కడే చనిపోయాడు. తోటి కూలీలు భయంతో మృతదేహాన్ని అక్కడే పూడ్చిపెట్టి తమకేమి తెలియనట్లు వ్యవహరించారు. మృతుని బంధువులు ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు కూలీలను విచారించగా అసలు విషయం బయట పడింది. దీంతో ముగ్గురుపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుమన్ కథన మేరకు.. పెదకంటిపల్లెలో రైతు వెంకటరెడ్డి పొలంలో పెద్ద రాళ్లు తీసేయాలని భూమిరెడ్డిపల్లెకు చెందిన మహదేవన్‌కు పనులు అప్పగించాడు. అతను గుడిపాల మండలం తుమ్మిందపాళ్యంకు చెందిన సంపత్(58), పరదరామికి చెందిన పెరుమాళ్లు, రిగుబండి ఉన్న సతీష్‌ను కూలీలుగా తీసుకున్నాడు. శనివారం సాయంత్రం పొలంలో రాళ్లను రిగ్గుబండితో పేల్చి వేశారు. ఆ సమయంలో రాళ్లు, మట్టి సంపత్‌పై పడడంతో అతను కూరుకుపోయి చనిపోయాడు. తోటి కూలీలు ఈ విషయం ఎవరికీ చెప్పకుండా మరింత మట్టిని వేసి పూడ్చివేశారు. ఆదివారం ఉదయం సంపంత్ ఇంటికి రాలేదని బంధువులు పొలంలో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్ల అడగ్గా, రాత్రే వెళ్లిపోయాడని చెప్పారు. బంధువులు అతని సెల్‌కు ఫోన్ చేయగా, అక్కడే ఫోన్ రింగ్ శబ్దం రావడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ముగ్గురినీ విచారించగా, అసలు విషయం బయట పడింది. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. దీనిపై మహదేవ్, పెరుమాళ్, సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని చిత్తూరు వెస్ట్ సీఐ రవి శంకర్ రెడ్డి పరిశీలించారు.

పేకాట స్థావరంపై దాడి

- రూ.73 వేల నగదు స్వాధీనం, 10మంది అరెస్ట్

చంద్రగిరి: పేకాటరాయుళ్లతో పాటు వారి నుంచి నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదివారం నరసింగాపురంలో చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్ వివరాల మేరకు.. నరసింగాపురానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి తన ఇంట్లో గత కొంతకాలంగా అక్రమంగా పేకాట ఆడిస్తున్నట్లు పక్కా సమచారంతో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో చంద్రగిరి, తిరుపతికి చెందిన సుమారు 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.73, 500 నగదు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్‌లో మెరుపులు

- బాలుర విజేత చరణ్‌రామ్, బాలికల విజేత జశ్విత
- ముగిసిన స్టేట్ సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ స్టేట్ అంతర జిల్లాల సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఎంవీపీకాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాలో జరిగిన ఈ పోటీల్లో అండర్ 15 బాల బాలికలకు సింగిల్స్, డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. ఏపీలోని 13 జిల్లాల నుంచి 279 మంది బాలబాలికలు ఈ పోటీల్లో తలపడ్డారు. బాలుర విజేతగా టి.చరణ్‌రామ్(చిత్తూరు), బాలికల విజేతగా డి.జశ్విత(విశాఖ) నిలిచారు. చరణ్‌రామ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కె.గగనశ్రీ(కర్నూలు)తో... బాలుర డబుల్స్‌లో వి.హరికృష్ణ(తూర్పుగోదావరి)తో కలిసి విజయం సాధించారు. బాలికల డబుల్స్‌లో బి.విజయ లక్ష్మి-కె.గగన శ్రీ(వీరిద్దరూ కర్నూలు) జోడి విజేతగా నిలిచింది. బాలికల సింగిల్స్‌లో టాప్ సీడ్ వై.రేణుశ్రీ(విజయనగరం)పై రెండో సీడ్ డి.జశ్విత(విశాఖ) 1-2తో విజయకేతనం ఎగురవేసింది. బాలుర సింగిల్స్‌లో టాప్ సీడ్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లోనే ఇంటిదారి పట్టగా టైటిల్ పోరులో నాలుగోసీడ్ చరణ్‌రామ్ నేరుగా 2-0 సెట్లతో ఐదో సీడ్ బి.అఖిల్(గుంటూరు)పై విజయం సాధించాడు. ఆయా అంశాల్లో విజేతలు రాష్ట్ర జట్టుగా సబ్ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించగా రన్నరప్‌గా నిలిచిన వారు జట్టుకు స్టాండ్‌బైగా నిలిచారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ రాజీవ్ కుమార్ మీనా విజేతలకు ట్రోఫీలందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి అంకెమ్మ చౌదరి, డీసీపీ సీహెచ్ శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

టైటిల్ పోరులో...

- డి.జశ్విత తొలి సెట్‌లో 15-21తో వెనుకబడినా రెండో సెట్‌లో 21-19తో సుముజ్జీగా నిలిచి డిసైడింగ్ సెట్‌లో 21-8తో వై.రేణుశ్రీపై విజయంతో బాలికల సింగిల్స్ టైటిల్ సాధించింది.
- టి.చరణ్‌రామ్ నేరుగా 21-19,21-11 పాయింట్లతో రెండు సెట్లలోనూ బి.అఖిల్‌పై విజయంతో బాలుర సింగిల్స్ టైటిల్ సొంతం చేసుకున్నాడు.
- టి.చరణ్‌రామ్-కె.గగన శ్రీ జోడి 21-8,21-12తో డి.ఉమేష్(నెల్లూరు)-ఎం.జిత్య(విశాఖ)జోడిపై విజయం సాధించి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సొంతం చేసుకుంది.
- రెండో సీడ్ బి.విజయలక్ష్మి-కె.గగనశ్రీ జోడి జె.నక్షత్ర(అనంతపురం)-ఎం.మనోజ్ఞ(పశ్చిమ గోదావరి)జోడిపై తొలిసెట్‌ను 21-19తో గెలిచి, రెండో సెట్‌లో 19-21తో కోల్పోయింది. చివరి సెట్‌లో 21-15తో గెలిచి బాలికల డబుల్స్ టైటిల్ సొంతం చేసుకుంది.
- టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన టి.చరణ్‌రామ్-వి.హరికృష్ణ జోడి 21-16, 21-15తో మూడో సీడ్ బి.అఖిల్(గుంటూరు)-బి.అభిషేక్(తూర్పు గోదావరి)జోడిపై విజయంతో బాలుర డబుల్స్ టైటిల్ సొంతం చేసుకుంది.

టమాటా ధరలు ఢమాల్



- బాక్సు ధర రూ.50
- నాణ్యమైన సరుకు టాప్‌రేట్ రూ. 270
- మార్కెట్లకు భారీగా పెరిగిన సరుకు
- డిమాండ్ తగ్గి ధరలు తగ్గుముఖం

మార్కెట్లలో బాక్స్ ధరలిలా

మార్కెట్	అత్యల్ప ధర	అత్యధిక ధర
పలమనేరు	రూ.50	రూ.270
వీకోట	రూ.50	రూ.280
పుంగనూరు	రూ.50	రూ.265
వడ్డిపల్లి(కర్ణాటక)	రూ.50	రూ.300
కోలారు(కర్ణాటక)	రూ.50	రూ.250

పలమనేరు హార్టీకల్చర్ డివిజన్‌లో....

ఈ సీజన్‌లో టమాటా సాధరణ సాగు	4వేల హెక్టార్లు
ప్రస్తుతం సాగైన పంట:	4వేల హెక్టార్లు
ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు	3వేల హెక్టార్లు
ప్రస్తుతం మార్కెట్లకు వస్తున్న సరుకు	80 లోడ్లు
అనంతపురం జిల్లా నుంచి వస్తున్న సరుకు	80 లోడ్లు

పలమనేరు: టమాటా ధరలు గతనెలగా తగ్గుతూ వచ్చి ఆదివారానికి భారీగా పతనమైయ్యాయి. పలమనేరుతో పాటు డివిజన్ పరిధి, పొరుగునే ఉన్న కర్ణాటకలోనూ సగటు ధర 15కిలోల బాక్సు రూ.50, అత్యధిక ధర రూ.270 దాకా పలికింది. పొరుగునే ఉన్న అనంతపూర్‌జిల్లా నుంచి ఎక్కువగా సరుకు రావడం, ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో టమాటా సీజన్ మొదలు కావడంతో డిమాండ్ లేక ధరలు తగ్గాయి. ఫలితంగా ఇతర రాష్ట్రాల వ్యాపారులు టమాటాలు కొనేందుకు జిల్లాలోని మార్కెట్లకు రావడంలేదు.

పలు రాష్ట్రాల్లో సీజన్

తమిళనాడులోని డిండిగల్, రాయకోట, మన రాష్ట్రంలోని కర్నూలు, ఆదోని, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీఘర్ రాష్ట్రాల్లో ఇటీవలే టమాటా సీజన్ మొదలైంది. అక్కడి మార్కెట్లకు లోకల్ సరుకు చేరుతోంది. దీంతో ఆ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గింది. అక్కడి వ్యాపారులు మన జిల్లాలోకి రావడం లేదు. స్థానికంగా సరుకు పెరిగింది. గతంలో ధరలు పలకడంతో ఎక్కువమంది రైతులు టమాటాను సాగుచేయడంతో ఉత్పత్తులు పెరిగాయి. ఫలితంగా ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు.